సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



సర్వేజనా ఆరోగ్యమస్తు..

క్యాన్సర్.. ప్రజల ప్రాణాలను హరించే మహమ్మారి. చాలా మందికి ఆ వ్యాధి వచ్చిందని తెలుసుకునేలోపే మృత్యువు సింహద్వారం వద్ద నుంచునే పరిస్థితి ఏర్పడుతుంది.


8లో



బాలల కళా కౌశలం!

బొమ్మూరులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో కళా ఉత్సవ్ 2025 సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఐదు అంశాల్లో పోటీలు నిర్వహించారు.

3.46 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం రాత్రి 3,46,486 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.60 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 12,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జిల్లా హౌసింగ్ పీడీగా బుజ్జి



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా హౌసింగ్ పీడీగా నాతి బుజ్జి పదోన్నతిపై శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమె గండేపల్లి మండల ఎంపీడీవోగా పనిచేసి తరువాత ఏలూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థలో డీఎల్డీఓగా పదోన్నతి పొందారు. డిప్యూటేషన్‌పై తూర్పుగోదావరి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలుపుదల

కాకినాడ రూరల్: కాకినాడ – ఉప్పాడ బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు తిమ్మాపురం ఎస్సై గణేష్ కుమార్ తెలియజేశారు. అలల ఉధృతి కారణంగా రోడ్డు దెబ్బతినడంతో ప్రమాదాలకు అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు శుక్రవారం ఆయన తెలిపారు. నేమాం చౌదరి గొస్ట్ వద్ద నుంచి బీచ్ రోడ్డు మూసివేసి ఉప్పాడ వెళ్లే వాహనాలను నేమాం, పండూరు గ్రామాల మీదుగా మళ్లించామన్నారు. ఉప్పాడ నుంచి వచ్చే వాహనాలు పిఠాపురం మీదుగా కాకినాడ వెళ్లేలా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు.

రికార్డు స్థాయికి వర్జీనియా పొగాకు ధర

దేవరపల్లి: వర్జీనియా పొగాకు ధర రికార్డు స్థాయికి చేరుకుంది. రైతుల్లో ఆనందం వెల్లువిరిసింది. ఈ నెల 2వ తేదీ వరకు కిలో ధర రూ.350 ఉండగా, 3న రూ.362, 4న రూ.375, 6న రూ.375, 8న రూ.375, 9న రూ. 390, 10న రూ.390, 11న రూ.395, 12న శుక్రవారం రూ.418 ధర పలికింది. గత ఏడాది కిలో గరిష్ఠ ధర రూ. 411 పలకగా ఈ ఏడాది ఈ ప్రస్తుతం రూ.418 పలకడంతో ముందు ముందు మరింత పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో కిలోకు రూ. 68 పెరగడంతో రైతులు ఖుషీగా ఉన్నారు. ముందుగా అమ్ముకున్న రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన చెందుతున్నారు. కిలో రూ.290 ప్రారంభ ధరతో ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కాగా, శుక్రవారం నాటికి 138 రోజులు కొనుగోళ్లు జరగ్గా కిలోకు గరిష్ఠంగా రూ.128 పెరిగింది. ఎక్కువ మంది చిన్న రైతులు రూ.290 ధరకు పంటను అమ్ముకున్నారు. ఈ ఏడాది పొగాకు అమ్మకాలు ముగిసే నాటికి ధర రూ.450 పలికినా ఆశ్చర్యపడనవసరం లేదని పలువురు అంటున్నారు. ఐదు వేలం కేంద్రాలో కిలో సగటు గరిష్ట ధర రూ.418, సగటు ధర రూ.322 లభించినట్టు పొగాకు బోర్డు రాజమహేంద్రవరం ప్రాంతీయ అధికారి జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకు ఐదు వేలం కేంద్రాల్లో సుమారు రూ.1,674 కోట్ల విలువ గల 58.25 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు తెలిపారు. 2024–25 పంట కాలానికి బోర్డు ఇచ్చిన కోటా మేరకు పొగాకు కొనుగోళ్లు పూర్తయినట్టు చెప్పారు. బ్యారన్‌కు 41.15 క్వింటాళ్ల పొగాకు ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, అదనంగా పంట ఉత్పత్తి జరిగిందని తెలిపారు. అదనంగా 30 మిలియన్ల కిలోలు ఉత్పత్తి జరిగిందని వివరించారు. బ్యారన్‌కు 4 క్వింటాళ్ల వరకు అదనపు పంటను ఎటువంటి రుసుం చెల్లించకుండా రైతులు వేలం కేంద్రాల్లో అమ్ముకోవచ్చునని తెలిపారు.

మీకు నచ్చని వార్తలు వస్తే కేసులు పెడతారా?



పత్రికల్లో మీకు నచ్చని వార్తలు, విమర్శలు వస్తే కేసులు పెడతారా? ఇదేం పద్ధతి? ఇంత దారుణంగా పత్రికా స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ మీద కూటమి ప్రభుత్వం దాడులు చేయడం దుర్మార్గం. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఇతర పాత్రికేయులపై కేసులు పెట్టడం, విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడం సరికాదు. ప్రభుత్వ అసమర్థత, ఇతర వైఫల్యాలను ప్రజల పక్షాన, ప్రజాగొంతుగా వినిపిస్తుంటే తట్టుకోలేక దాడులకు దిగుతున్నట్లుగా స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వం చర్యలను యావత్ ప్రజానీకం గమనిస్తోంది. – మార్గాని భరత్‌రామ్, మాజీ ఎంపీ, రాజమహేంద్రవరం



ప్రజాస్వామ్యానికి విరుద్ధం



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండే పత్రికల మీద దాడులు చేసి కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఇది ప్రతికా స్వేచ్ఛను అడ్డుకోవటమే. జర్నలిస్టులు వెతికి తీసిన సమస్యలపై ప్రభుత్వం స్పందించాలే తప్ప వారిపై కేసులు పెట్టడం అమానుషం. ప్రభుత్వం వెంటనే సాక్షి ప్రతినిధులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి.

– పిల్లి సుభాష్ చంద్రబోస్, రాజ్యసభ సభ్యుడు

వరిదొడుకులు తప్పేనా?



ఉసులుమర్రులో కోతకు సిద్ధమవుతున్న వరిచేలు

- ఖరీఫ్ ధాన్యం సక్రమంగా కొనుగోలు చేస్తారా?
- జిల్లాలో 55,021 హెక్టార్లలో సాగు
- 5,31,616 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి అంచనా
- రబీలో 5.20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- కొనుగోలు 2.50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే
- ఇప్పుడు అలాగే ఉంటుందా అని రైతులకు అనుమానాలు
- ఊహించని విధంగా తగ్గిన వరి సాగు విస్తీర్ణం

పెరవలి: ఖరీఫ్‌లో ధాన్యాన్ని సేకరించటానికి అధికారులు సిద్ధమవుతుండగా రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సాగులో అధికారులు వేసిన అంచనాలు తప్పటంతో ధాన్యం కొనుగోలు కూడా ఇలాగే ఉంటుందా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత రబీ సీజన్‌లో పడినపాట్లు మరువక ముందే నేడు ఖరీఫ్ సాగు పంట అందుబాటులోకి రానుండటంతో అధికారులు ఏ విధంగా ధాన్యం కొనుగోలు చేస్తారా అని చర్చించుకుంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు 76,941 హెక్టార్లలో చేపడతారని అంచనాలు వేసినా 55,021 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేశారు. ఈ నెల 11న జరిగిన జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశంలో 5,31,616 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే ఎంతమేర కొనుగోలు చేస్తారనేది అధికారులు చెప్పలేదు. దీంతో రైతులు గందరగోళంలో పడ్డారు. గత ఏడాది రబీ సీజన్‌లో 5.20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా 2.50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయటంతో రైతులు నానా పాట్లూ పడ్డారు.

సాగు తగ్గడానికి కారణాలు

ఖరీఫ్‌లో వరి సాగు తగ్గింది. జిల్లాలో 21,920 హెక్టార్లలో అసలు నాట్లే పడలేదు. రైతులు వరి సాగు చేపట్టకపోవటానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో సేకరించక దళారీలకు అమ్ముకోవలసి వస్తోంది. మెట్టలో ముందస్తుగా వరి కోతలు పూర్తి అవుతుండగా డెల్టా ప్రాంతంలో చేలు నవంబర్‌లో కానీ కోతలకు రావటం లేదు. దీంతో ముందుగా కోతలు కోసిన చేల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి టార్గెట్ పూర్తి అయ్యిందని చెప్పటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత రబీ సీజన్‌లో ఇలాగే జరగటంతో రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. అధికారులు, మిల్లర్లు చుట్టూ ప్రదక్షిణలు చేసి ధాన్యం అమ్ముకోలేక అయిన కాడికి దళారీలకు విక్రయించుకున్నారు. ఈ సార్వా సీజన్‌లో యూరియా కోసం రైతులు నానా పాట్లు పడుతున్నారు. అధికారులు మాత్రం జిల్లాకు సరిపడా యూరియా వచ్చిందని, గతంలో కంటే ఎక్కువ యూరియా సరఫరా చేశామని చెబుతున్నారు. కష్టపడి పండించిన పంట అమ్ముకొనే వీలు లేనప్పుడు అసలు పంటే వేయకపోవడమే మంచిదని నిర్ణయించుకున్నామని, అందుకే సాగు చేపట్టలేదని రైతులు చెబుతున్నారు.

లక్ష్యాన్ని చేరుతుందా..

ఖరీఫ్ సాగులోనైనా రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది. రబీలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ఈసారైనా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయాలి. పంట దిగుబడి అంచనా వేసిన అధికారులు అందుకు అనుగుణంగా కొనుగోలు కూడా చేపడితేనే రైతుల కష్టాలు గట్టెక్కుతాయి.

జిల్లాలో ఇలా..

మండలం	వరి సాగు (హెక్టార్లలో)
రాజమహేంద్రవరం రూరల్	1,191
కడియం	2,100
రాజానగరం	2,791
అనపర్తి	3,310
బిక్కవోలు	5,265
కోరుకొండ	1,052
గోకవరం	1,114
సీతానగరం	4,632
రంగంపేట	1,160
చాగల్లు	3,110
దేవరపల్లి	2,818
గోపాలపురం	1,400
కొవ్వూరు	4,316
నిడదవోలు	6,600
పెరవలి	2,325
తాళ్ళపూడి	2,395
ఉండ్రాజవరం	4,792
నల్లజర్ల	4,650

ఇబ్బంది లేకుండా చూడాలి



రబీ సీజన్‌లో ధాన్యం అమ్మిన సొమ్ము ఆలస్యంగా రావడంతో నానా పాట్లూ పడ్డాం. ఈ ఏడాదైనా సక్రమంగా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

–చిట్టీడి వెంకట సత్యనారాయణ, రైతు, పెరవలి

డెల్టాను దృష్టిలో ఉంచుకోవాలి



ఈ ఖరీఫ్‌లో నాట్లు వేసే దశ నుంచీ ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే రెండు సార్లు వర్షాలకు నారు పోయింది. డెల్టాలో వరి కోతలు నవంబర్ నెలలో ప్రారంభం అవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు ధాన్యం కొనుగోలు చేయాలి.

– అధికారి పల్లపురాజు, రైతు, కానూరు అగ్రహారం

జిల్లా పేరే మార్చేశారు.. స్మార్ట్‌గా!

రేషన్ కార్డుల్లో పేరు మార్పుపై లబ్ధిదారుల ఆందోళన



ఓ కుటుంబానికి అందించిన స్మార్ట్ రేషన్‌కార్డుపై తూర్పుగోదావరి జిల్లా అని ముద్రణ అయిన దృశ్యం

అమలాపురం టౌన్: అత్యంత ఆధునిక, సాంకేతిక, పారదర్శకతతో రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులతో సరుకులను పొందే అవకాశాన్ని కల్పిస్తున్న ప్రభుత్వం వాటి ముద్రణలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరును విస్మరించింది. జిల్లాలో పంపిణీకి సిద్ధమైన 5,31,926 స్మార్ట్ కార్డుల్లో కొన్నింటిపై జిల్లా పేరు కాకుండా తూర్పుగోదావరి జిల్లా అని ముద్రించడం విమర్శలకు తావిస్తోంది. ఈ కార్డులపై ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకుని మరీ ఈ తప్పిదానికి పాల్పడడం శోచనీయం. జిల్లా 2022 ఏప్రిల్ 4న ఏర్పాటైంది. ఇప్పటికి మూడేళ్లు దాటినా జిల్లా పేరుకున్న గౌరవాన్ని తగ్గించేలా ఇంకా తూర్పుగోదావరి జిల్లాగా వాటిపై ముద్రించడం శోచనీయం. ఇప్పటికే ఈ కార్డుల పంపిణీ మొదలైంది. వాటిపై జిల్లా పేరు తప్పుగా పడడం వల్ల తమకు రేషన్ ఇస్తారో లేదోనని లబ్ధిదారులు కంగారు పడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అని రాయడం ఇష్టం లేక తూర్పుగోదావరి జిల్లా అని ముద్రించారా అని జిల్లాకు చెందిన కొందరు ఎస్సీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. తక్షణమే కార్డులపై తమ జిల్లా పేరు ముద్రించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ స్మార్ట్ కార్డు ద్వారా లబ్ధిదారులు రేషన్ సరుకులు తీసుకునే సమయంలో ఆధార్ ఆధారంగా ఓటీపీ లేదా బయోమెట్రిక్‌తో పొందే వీలుంటుదని జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.దయ భాస్కర్ చెబుతున్నారు. జిల్లాకు వచ్చిన కొన్ని కార్డుల్లో మాత్రమే తూర్పుగోదావరి జిల్లా అని ముద్రించారని, ఈ తప్పిదాలను సరిదిద్దుతామని పేర్కొన్నారు. దీని వల్ల స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ పొందేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.

కొబ్బరి మరింత ప్రియం

సాక్షి, అమలాపురం: కొబ్బరి కాయ ధర మరింత పెరిగింది. దసరా ఎగుమతులు జోరుగా సాగుతుండడంతో కాయకు అంచనాలకు మించి ధర వస్తోంది. అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో శుక్రవారం సాయంత్రం వెయ్యికాయల ధర రూ.25 వేల నుంచి రూ.26 వేల వరకు పలికింది. గోదావరి లంక గ్రామాల కాయను రూ.27 వేలు చేసి కొంటున్నారని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. కొబ్బరికాయకు గత నెల రోజులుగా రికార్డు స్థాయిలో ధర పెరుగుతున్న విషయం తెలిసిందే. తన రికార్డులను తానే బద్దలు కొట్టుకుంటోంది. కాయకు రూ.20 ధర రావడమే రైతులు ఊహించలేదు. అటువంటిది ఇప్పుడు ఈ ధర చూసి రైతులు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారు. దసరా, తరువాత దీపావళి, ఆపై కార్తిక మాసం కావడంతో ధర అనూహ్యంగా పెరిగింది. మహారాష్ట్ర నుంచి డిమాండ్ లేకపోవడంతో ధర ఈస్థాయిలో ఉంది, లేకుంటే రూ.28 వరకు వచ్చేదిని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి రోజుకు 60 లారీలకు పైగా కొబ్బరికాయ గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్‌కు అధికంగా ఎగుమతి అవుతోంది.

బీసీలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానం అమలు చేయండి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): 2024 ఎన్నికల ముందు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నేతలు వెనుకబడిన తరగతులైన బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు పరచాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా నాయకులు దొమ్మేటి శంకరరావు, సత్యనారాయణ, బిల్డర్ చిన్నల ఆధ్వర్యంలో బీసీల ×బద్దు ప్రధాన డిమాండ్లపై శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి అనంతరం ఆర్డీఓ కృష్ణనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న బీసీలకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ×ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి ఏడాదిన్నర గడుస్తున్నా ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభలలో 33 శాతం, స్థానిక సంస్థల నామినేటెడ్ పదవులు, నామినేషన్ లలో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరుపుతామన్న మరో వాగ్దానం ఇప్పటి దాకా అమలు కాలేదన్నారు. స్థానిక ప్రాదేశిక నియోజక వర్గాల విభజన పూర్తి చేయకుండా, బీసీలకు స్థానిక ఎన్నికలలో రిజర్వేషన్లు ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. ఏప్రిల్ తరువాత ఆరు నెలల లోపు కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికలు జరిపే వీలున్నందున, ఈ లోపే రాష్ట్రవ్యాప్తంగా కులగణన జరిపి, ప్రాదేశిక నియోజక వర్గాల విభజన పూర్తి చేసి, బీసీలకు వారి జనాభా దామాషా మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు జరపాలన్నారు. కార్యక్రమంలో నరవ గోపాలకృష్ణ మార్గాని సురేష్, బీసీ నాయకులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కృష్ణనాయక్‌కి వినతి పత్రం అందిస్తున్న బీసీ సంఘ నాయకులు



మగ్గంపై చేనేత వస్త్రాలు నేస్తున్న కార్మికుడు

చేనేత.. సమస్యల కలబోత

- మూసివేత దిశగా సొసైటీలు
- 'బాబు' బకాయి రూ.7 కోట్లు
- జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ఊసే లేదు
- అమలు కాని ఉచిత విద్యుత్ హామీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: చేనేత కుటుంబాలు బకాయిల గుదిబండతో చితికిపోతున్నాయి. గడచిన 10 నెలలుగా పైసా కూడా విదల్చక పోవడంతో చేనేత సహకార సంఘాలు మూత వేసుకునే దుస్థితి ఏర్పడింది. సూపర్ సిక్స్–సూపర్ హిట్ అంటూ అన్ని పథకాలు అమలు చేశామంటూ కూటమి ప్రభుత్వం సంబరాలు చేసుకుంటోంది. సూపర్ సిక్స్ అమలుమాట దేవుడెరుగు కనీసం అప్పులు కూడా పుట్టక చేనేత రంగం కుదేలైందని చేనేత కుటుంబాలు ఘొల్లుమంటున్నాయి. చంద్రబాబు సర్కార్ గద్దె నెక్కి 14 నెలలు దాటిపోయినా బకాయిలు విడుదల చేయకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా చేనేతలు చేతిలో చిల్లిగవ్వ లేక నూటికి రూ.8ల వడ్డీతో అప్పుల కోసం రోడ్డెక్కే దయనీయ పరిస్థితిలో ఉన్నారు. సంప్రదాయంగా చేనేత ఉత్పత్తులనే నమ్ముకుని జీవనం సాగిస్తోన్న కుటుంబాల భవిష్యత్ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ముందుకు వెళదామంటే నుయ్యి, వెనక్కు వద్దామంటే గొయ్యి అన్న సామెత చందంగా నేతన్నల పరిస్థితి తయారైంది. అనేక చేతివృత్తులు కాలగర్భంలో కలిసిపోతుంటే చేనేత రంగం కాలానికి ఎదురునిలిచి పోరాడుతోంది. అగ్గిపెట్టిలో ఇమిడిపోయే ఆరు మూరల చీరను నేసి ప్రపంచానికి చేనేత కళావైభవాన్ని చాటి చెప్పిన ఈ ప్రాంతంలో చేనేతల జీవితం కష్టాలు, కన్నీళ్ల కలబోతగా మారింది. ఈ దుస్థితికి కూటమి ప్రభుత్వం నిర్వాకం కూడా కారణమని చేనేత సంఘాల ప్రతినిధులు ఆక్షేపిస్తున్నారు.

ఉచిత విద్యుత్ ఉత్తిమాట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 పైబడే చేనేత సహకార సంఘాలు నడుస్తున్నాయి. ఈ సంఘాల పరిధిలో చేనేత కుటుంబాలు ఉప్పాడ కొత్తపల్లి, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, రామచంద్రపురం మండలం ఆదివారపుపేట, అంగర, పులుగుర్త, వడిశలేరు, ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి, ముమ్మిడివరం, క్రాపచింతలపూడి శివారు కె జగన్నాథపురం, బండార్లంక తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ మొత్తం సంఘాల పరిధిలో జరిగే లావాదేవీలపై సుమారు 13వేల చేనేత కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఉమ్మడి తూర్పున పేరుకుపోయిన బకాయిలు విడుదల చేయడం ద్వారా మాత్రమే భవిష్యత్‌లో సంఘాలు మనుగడ సాగిస్తాయనేది నిర్వివాదాంశంగా పేర్కొటున్నారు. గతంలో మాదిరిగా సంఘాలు ఇకముందు కూడా సక్రమంగా నడవాలంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా కలిసి సంఘాలకు రావాల్సిన రూ.7 కోట్ల బకాయిలు విడుదల చేయాలంటున్నారు. తనతోనే చేనేత రంగం ప్రగతిబాటలో పయనించిందని గొప్పలకు పోతోన్న చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే బకాయిలు విడుదల చేసి మాట్లాడాలంటున్నారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు 200 యూనిట్ల వినియోగం వరకు విద్యుత్ ఉచితమని చంద్రబాబు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో చూస్తే ఇందుకు భిన్నంగా 100 యూనిట్లకు పైబడి వినియోగించిన వారికి విద్యుత్ బిల్లులు సెప్టెంబర్ నెలలో చేతిలో పెట్టారని చేనేత కార్మికులు మండిపడుతున్నారు.

పెట్టుబడులు పెట్టే స్తోమత లేక..

ఉమ్మడి జిల్లాలో ఒకో సంఘానికి తక్కువలో తక్కువ రూ.ఏడెనిమిది లక్షల నుంచి రూ.90 లక్షల వరకు బకాయిలు ఉన్నాయి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కపిలేశ్వరపురం మండలంలోని ఒక్క అంగర చేనేత సహకార సంఘానికే రూ.90 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. జాతీయ స్థాయిలో రెండు పర్యాయాలు అవార్డు దక్కిన అంగర చేనేత సహకార సంఘం దుస్థితి ఇలా ఉంటే మిగిలిన సంఘాల పరిస్థితి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇలా ఈ సంఘాలలో సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు ఆప్కో నుంచి రూ.7 కోట్ల బకాయిలు విడుదల చేయించాల్సిన బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసి తమ పొట్టకొడుతోందని చేనేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు విడుదల చేయక, పెట్టుబడులు పెట్టే స్తోమత లేక, బయట మార్కెట్‌లో రూ.8ల వడ్డీకి అప్పులు తెచ్చే సాహసం చేయలేక చివరకు సొసైటీలను మూసేసే దుస్థితి దాపురించిందని నేతన్నలు అంటున్నారు. ఎన్నికల్లో కూటమి నేతన్నలకు ఇచ్చిన హామీ ఉచిత విద్యుత్. గద్దె నెక్కి 14 నెలలు దాటినా అమలు చేయకుండా సర్కారు దగా చేసింది. సాధారణ మగ్గాలపై ఉచిత విద్యుత్‌ను మరో 100 యూనిట్‌లకు పెంచుతున్నామని చెప్పారే తప్ప ఆచరణలో అమలుకునోచుకోలేదు. కానీ గత నెల7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఉచిత విద్యుత్ అమలులోకి వచ్చేసినట్టు చంద్రబాబు చెప్పిన మాటలకు ఉబ్బితబ్బిబ్బయ్యారు. తీరా సెప్టెంబర్ నెలలో 100 యూనిట్లు దాటిన విద్యుత్ బిల్లులు చేతిలో పెట్టి ఉచిత విద్యుత్ అమలుచేయకుండా కూటమి సర్కార్ మోసం చేస్తోందని నేతన్నలు విమర్శిస్తున్నారు. ఈ పథకం అమలుచేయకపోవడంతో ఏడాదిగా సుమారు రూ.4కోట్ల రాయితీ ఎగ్గొట్టేసిందని చేనేత ప్రతినిధులు ఆక్షేపిస్తున్నారు. ముడినూలు కొనుగోలు సమయంలో చేనేత కార్మికులు 5శాతం జీఎస్టీ చెల్లిస్తున్నారు. ఈ కారణంగా చీరల ధరలు పెంచడంతో మార్కెట్‌లో విక్రయాలు మందగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వమే 5శాతం జీఎస్టీ చెల్లిస్తామని ప్రకటించింది. ఈ విషయంలో కూడా సర్కార్ నమ్మించి మోసగించిందని, జీఎస్టీ చెల్లించలేదంటున్నారు. ఇందుకు తోడు త్రిఫ్ట్ ఫండ్ మాటే వినిపించడం లేదంటున్నారు. సహకార సంఘాల్లో నేత కార్మికుల ఆదాయంలో 8శాతం మినహాయించి సొసైటీలో జమ చేస్తుంటారు. ఆ మొత్తానికి రెట్టింపు 16శాతం ప్రభుత్వం త్రిఫ్ట్‌ఫండ్ జతచేసి మూడు నెలలకు ఒకసారి కార్మికుల ఖాతాలకు జమ చేస్తుంటుంది. ఈ త్రిఫ్ట్ ఫండ్ రూ.5 కోట్లు విడుదల చేశామని సంబంధిత మంత్రి సవిత ఆరు నెలల క్రితం ప్రకటించడమే తప్ప ఆ సొమ్ము ఎక్కడా తమ ఖాతాల్లో జమ కాలేదని సంఘాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉండి ఉంటే ఇప్పటికే ఒక విడత నేతన్న నేస్తం రూ.24వేలు జమ అయ్యేదంటున్నారు.

బకాయిలు విడుదల చేయాలి



బకాయిలు విడుదల చేయకుంటే సొసైటీ మూతే వేసే పరిస్థితి. సొసైటీలు మనుగడ సాగించేందుకు 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలి. ప్రొక్యూర్‌మెంట్ కూడా సక్రమంగా జరగడం లేదు.

– ఉప్పు అర్ధనారీశ్వర బులిరాజు, ఆదివారపుపేట, రామచంద్రపురం మండలం

ఎన్నికల హామీలు అమలు చేయాలి



ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు జరపాలి. సంఘాలకు ఎన్నికలు జరపాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.7కోట్లు ఆప్కో ద్వారా సహకార సంఘాలకు బకాయిలను చెల్లించింది.

– జాన జగదీష్ చంద్ర గణేష్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు, కోనసీమ జిల్లా

చేనేతను ఆదుకోవడం సామాజిక బాధ్యత



చేనేత వృత్తి పరిరక్షణ ప్రభుత్వం సామాజిక బాధ్యతగా పరిగణించాలి. జాతీయ స్థాయిలో అనేక అవార్డులు అందుకున్న చరిత్ర అంగర చేనేత సహకార సంఘం సొంతం. అటువంటి సొసైటీకి ఆప్కో నుంచి రూ.కోటి పైగానే బకాయిలు పేరుకుపోయాయి. సొమ్ము విడుదల కాకుంటే సంఘం మూతపడే ప్రమాదం ఉంది.

– గుడిమెట్ల శివరామకృష్ణ, మాజీ చైర్మన్, శ్రీ గణపతి చేనేత పారిశ్రామికుల సహకార సంఘం, అంగర

క్లుప్తంగా

మైనర్‌పై లైంగిక దాడి
యువకుడిపై అట్రాసిటీ, పోక్సో కేసుల నమోదు

తాళ్లపూడి (కొవ్వూరు): మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో యువకుడిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ విశ్వం తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు కొవ్వూరుకు చెందిన దాసరి వెంకటేశ్వరరావు బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై ఎస్సీ అట్రాసిటి కేసుతో పాటు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు.

పోక్సో కేసులో ఇద్దరి అరెస్టు

గోకవరం: గోకవరంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన గునిపే కిరణ్ కుమార్, మరో బాలుడు కలిసి స్థానిక బంగాళాపేటకు చెందిన బాలికను మాయ మాటలతో నమ్మించి వారి ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి కుటుంబ సభ్యుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు కోరుకొండ సీఐ సత్యకిశోర్ ఆధ్వర్యంలో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు శుక్రవారం గోకవరం ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన నేపథ్యంలో పోలీసులు హడావుడిగా దోషులను అరెస్టు చూపించి కోర్టులో హాజరుపర్చడం విశేషం.

ఎల్ఎన్ పురంలో చోరీ

పిఠాపురం: ఎవరూ లేరని పసిగట్టిన దుండగులు ఒక ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన పిఠాపురం మండలం ఎల్ఎన్ పురంలో శుక్రవారం జరిగింది. అదే గ్రామానికి చెందిన గంప నిర్మల అనే గృహిణి వారం రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి కాకినాడ బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటికి వేసిన తాళం బద్దలు కొట్టి ఉండడం చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించింది. వెంటనే పిఠాపురం రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహకారంతో ఆధారాలు సేకరించారు. ఇంట్లో బీరువా పగలగొట్టి దానిలో ఉంచిన 13 కాసుల బంగారం, 11 తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై జాన్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల అక్రమ నిల్వలు స్వాధీనం

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడిలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో రికార్డుల్లో నమోదు కాని రూ.2.58 లక్షల విలువైన 15.26 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకుని ఈసీ చట్టం 1955 ప్రకారం 6ఏ కేసు నమోదు చేశారు. త్యాజంపూడిలోని ప్రవేటు డీలరు వద్ద 1026, 20:20, యూరియా ఎరువులు రికార్డుల్లో సక్రమంగా నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న నిల్వలకు, దుకాణంలో ఉన్న నిల్వలకు తేడా రావడంతో ఎరువులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ సీఐ మధుబాబు తెలిపారు. దేవరపల్లిలోని డీసీఎంఎస్ గిడ్డంగిలో తనిఖీలు నిర్వహించగా, ఒక రైతు బస్తా ఎరువు కొనుగోలు చేసి, బిల్లు తీసుకుని బస్తా తీసుకువెళ్లకపోవడంతో రికార్డు ప్రకారం నిల్వలు తేడా రావడంతో అమ్మకాలు నిలిపివేసి వివరణ అడిగినట్టు ఆయన తెలిపారు. నివేదికను జేసీ కోర్టుకు అందజేస్తామని ఆయన తెలిపారు. రాత్రి 7.30 గంటల వరకు సోదాలు నిర్వహించారు. దాడుల్లో కొవ్వూరు ఏడీఏ శ్రీనివాస్, ఎంఏఓ కె.కమల్ రాజ్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల కళా కౌశలం!

- నాటక, దృశ్య కళల్లో విద్యార్థుల ప్రతిభా పాటవాలు
- ఆకట్టుకున్న కళా ఉత్సవ్ 2025
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 80 మంది హాజరు
- ఘనంగా ముగిసిన ఉత్సవాలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విజేతలతో డైట్ ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు, అధ్యాపకులు, న్యాయ నిర్ణేతలు



నాటికలో బాలికల ప్రదర్శన



నాటక విభాగంలో ప్రదర్శన చేస్తున్న దివ్యాంగ విద్యార్థి అబుకిజర్ మహమ్మద్



దృశ్యకళల పోటీలో బొమ్మలు చేస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో కళా ఉత్సవ్ 2025 సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఐదు అంశాలలో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 30 పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నాటక, దృశ్య కళలు, వ్యక్తిగత మరియు బృంద విభాగాలలో పలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్ 9వ తరగతి దివ్యాంగ విద్యార్థి మహబూబ్ కిజర్ మహమ్మద్ మాస్టర్ వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. ముగింపు కార్యక్రమంలో పోటీలలో విజేతలకు డైట్ ప్రిన్సిపాల్ ఆర్‌జేడీ రాజు చేతుల మీదుగా సర్టిఫికెట్లు, షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న కళాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ కార్యక్రమం వేదికగా ఉపయోగపడుతుందన్నారు. డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకులు కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల సామాజిక మరియు సాంస్కృతిక అభివృద్ధికి ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా పీపీఎస్ జోగన్న శాస్త్రి, ఎం.శ్రీనివాస్, పుప్పాల బాపిరాజు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎం.రాజేష్, వి.శిరీష ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజేతలు

నాటక కళల బృంద విభాగంలో కె.విమల, సీహెచ్ కళ్యాణి, జి.చరణ్ తేజ, జి.అజయ్ కుమార్ (ఎంఎఎస్ఎన్‌సీ ఎయిడెడ్ హైస్కూల్, కాకినాడ), దృశ్య కళల (2డి) వ్యక్తిగత విభాగంలో ఏ.ప్రియదర్శిని, (నెహ్రూ నగర్ మున్సిపల్ హైస్కూల్, రాజమహేంద్రవరం), శిల్ప కళ (3డి) వ్యక్తిగత విభాగంలో డి.దుర్గా జగదీష్, (జెడ్పీహెచ్ఎస్, రావులపాలెం), దృశ్యకళల బృంద విభాగంలో కేఆర్‌పి కుమారి (పీఎస్‌సీఎం జెడ్పీహెచ్ఎస్, మండపేట). సంప్రదాయ కథా కథనంలో బి.పరిమళ (విజ్ఞాన్ జూనియర్ కళాశాల, రాయవరం) విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

అనధికార క్వారీల్లో తనిఖీలు

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాల సర్వే నెంబరు 15లో అనధికారికంగా నిర్వహిస్తున్న నల్ల రాయి క్వారీలో మైనింగ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం రాత్రి చేపట్టిన ఈ తనిఖీలో రెండు చోట్ల అనధికార క్వారీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

ఈ మేరకు క్వారీల్లో పనిచేస్తున్న రెండు జేసీబీలు, ఒక లారీని సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎవరైనా అనధికారికంగా నల్లరాయి క్వారీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మైనింగ్ అధికారులు సత్యతేజ, రవీంద్రలు పాల్గొన్నారు.



అధికారులు సీజ్ చేసిన లారీ, జేసీబీ యంత్రాలు

పట్టాలెక్కిన ప్రసాద్ నిర్మాణాలు

అన్నవరం: రత్నగిరిపై ప్రసాద్ పథకం నిధులతో చేపట్టనున్న నిర్మాణాలకు రంగం సిద్ధమైంది. ఈ పథకం కింద కేటాయించిన రూ.25.32 కోట్లలో రూ.18.98 కోట్లతో చేపట్టనున్న పనులకు గత మే నెలలో టెండర్లు ఖరారైన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయా పనులు చేపట్టనున్న స్థలాలను రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. అతి త్వరలో ప్రతిపాదించిన నిర్మాణాలు ప్రారంభిస్తామని, వచ్చే ఆగస్టు నాలుగో తేదీకి వాటిని పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. లేకుంటే ఆ నిధులు మురిగిపోతాయని వివరించారు. ఆయన వెంట ఈఈ వీర్ల సుబ్బారావు, ఈఈ రామకృష్ణ, టూరిజం ఈఈ విజయ భాస్కరరెడ్డి, డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.



ప్రసాద్ నిధులతో అన్నదాన భవనం నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న టూరిజం సీఈ వెంకట రమణ, ఇతర అధికారులు

సర్వేజనా ఆరోగ్యమస్తు..

- జిల్లాలో ఎన్‌సీడీ 4.0 సర్వేకు చర్యలు
- ఆరోగ్య సమాజమే లక్ష్యంగా ఇంటింటి సర్వే
- ముందస్తు గుర్తింపుతో సరైన వైద్యానికి అవకాశం

రాయవరం: క్యాన్సర్.. ప్రజల ప్రాణాలను హరించే మహమ్మారి. చాలా మందికి ఆ వ్యాధి వచ్చిందని తెలుసుకునేలోపే మృత్యువు సింహ ద్వారం వద్ద నుంచునే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ వ్యాధిని ఆలస్యంగా గుర్తించడం వల్ల మరణాల సంఖ్య పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్య పరిస్థితిని ముందుగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఆధ్వర్యంలో ఏటా జిల్లా వ్యాప్తంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ) ప్రోగ్రామ్‌ను చేపడుతున్నారు. ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందని వ్యాధులను నాన్ కమ్యూనికల్ డిసీజెస్‌గా పిలుస్తారు. బీపీ, షుగర్, క్యాన్సర్, కిడ్నీ, గుండె తదితర జబ్బులను ముందుగానే పసిగట్టడానికి వైద్య, ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఎన్‌సీడీ 4.0 సర్వేకు ఆ శాఖ చర్యలు ప్రారంభించింది.

నాలుగేళ్ల నుంచి..

2021 అక్టోబరులో తొలిసారిగా ఎన్‌సీడీ సర్వే చేపట్టింది. రెండో విడత 2022 అక్టోబర్ 2 నుంచి, మూడో విడత 2024 నవంబరులో నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు.

పరీక్షలు ఇలా

వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి 18 ఏళ్ల నిండిన వారికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తారు. మహిళలకు ఆరోగ్య సమస్యలు, నెలసరి వివరాలు, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్ వంటి సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. ఈ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, హెమోగ్లోబిన్ వంటి పరీక్షలు చేస్తారు. విద్యార్థులకు పాఠశాలల్లోనే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరం అయితే ఆరోగ్యశ్రీ కింద ఇతర నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు. ఇక బీపీ, షుగర్ తదితర వ్యాధులకు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీల ద్వారా చికిత్స అందిస్తున్నారు.

వెలుగు చూస్తున్న వ్యాధులు

ఈ పరీక్షల్లో వెలుగుచూస్తున్న సమస్యల్లో బీపీ ముందు వరుసలో, తర్వాత స్థానంలో మధుమేహం ఉంటోంది. అనుమానిత జాబితాలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము, నోటి క్యాన్సర్ ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. బీపీ, షుగర్ వ్యాధులను నియంత్రణలో ఉంచుకోకుంటే శరీరంలో ప్రధాన భాగాలైన కళ్లు, కిడ్నీ, గుండె, నరాలు తదితర భాగాలు దెబ్బతింటాయి. అలాగే మద్యపానం, పొగతాగడం, గుట్కాలు తదితర వ్యసనాల వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.



ఎన్‌సీడీ 4.0 లోగో



ఎన్‌సీడీ 3.0 సర్వేలో మధుమేహ పరీక్ష చేస్తున్న సిబ్బంది (ఫైల్)

మూడో విడతలో..

గతేడాది జిల్లాలో 18 ఏళ్లు పైబడిన 14,68,723 మందిలో 11,29,412(77శాతం) మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 2,06,666 మందికి బీపీ (18.30 శాతం), చక్కెర వ్యాధిగ్రస్తులు 1,41,508 (12.53 శాతం) మంది ఉన్నట్టు గుర్తించారు. నోటి సంబంధ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు గతంలో 215 మంది ఉండగా ఈ సర్వేలో 4,172 అనుమానిత కేసులు గుర్తించారు. అలాగే గతంలో 466 మంది రొమ్ము క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఉండగా, ఈ సర్వేలో 2,090 మందికి లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. కాగా వీరిలో ముగ్గురికి మాత్రమే క్యాన్సర్ నిర్ధారణ అయ్యింది. సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వార) క్యాన్సర్‌కు గురైన వారు గతంలోనే 283 మంది ఉండగా, 1,894 మంది అనుమానిత కేసులు గుర్తించారు.

నాలుగో సర్వేకు ఏర్పాట్లు

జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ నాలుగో సర్వేకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది నిర్వహించే సర్వేలో క్యాన్సర్‌పై ప్రధానంగా దృష్టిపెడుతున్నారు. నోటి సంబంధిత, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లపై ప్రధానంగా సర్వే ఉంటుంది. సర్వేలో 110 మంది వైద్యులు పాల్గొననున్నారు. ఇప్పటికే వీరికి శిక్షణ పూర్తి చేశారు. అలాగే జిల్లాలో 527 మంది మల్టీపర్పస్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్ఎంలకు శిక్షణ ఇస్తున్నారు. వీరికి ఆగస్టు 25న ప్రారంభమైన శిక్షణ ఈ నెల 18వ తేదీతో పూర్తికానుంది.

ప్రజలు సహకరించాలి



నాన్ కమ్యూనికల్ డిసీజెస్‌ను గుర్తించేందుకు నాలుగో విడత సర్వే ఈ ఏడాది నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. మూడో విడత సర్వే మాదిరిగానే నాల్గవ విడత సర్వేకు ప్రజలు సహకరించాలి.

– డాక్టర్ సుమలత, ఎన్‌సీడీ జిల్లా నోడల్ అధికారి, కోనసీమ జిల్లా

ముందుగా గుర్తిస్తే నయం



మారిన జీవనశైలి, ధూమ, మద్యపానాలు, పొగాకు సేవనంతో పాటుగా వంశపారంపర్యం వంటి కారణాలతో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ముందుగా గుర్తిస్తే మెరుగైన వైద్యం అందించి నయం చేసే అవకాశం ఉంది. సర్వే చేయడం వల్ల ప్రజలకు ఉపయోగం.– డాక్టర్ దుర్గారావు దొర, డీఎంహెచ్ఓ, కోనసీమ జిల్లా

దేవస్థానానికి చెరువుల స్వాధీనం

కాజులూరు: ఆర్యావటంలో అనధికారికంగా కొనుగోలు చేసిన శ్రీ సీతారామస్వామి దేవస్థానం భూమిని కోర్టు ఉత్వర్వుల మేరకు శుక్రవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు దేవస్థానం అధికారులకు అప్పగించారు. వివరాల్లోనికి వెళ్లితే ఆర్యావటంలో పురాణ ప్రసిద్ధిగాంచిన సీతారామస్వామి దేవస్థానానికి ధూపదీప నైవేద్యాల నిమిత్తం కేటాయించిన నాలుగు ఎకరాల ఆరు సెంట్లు భూమిని వంశపారంపర్య అర్చకుడు 1999వ సంవత్సరంలో అనధికారికంగా ఆరుగురు వ్యక్తులకు విక్రయించారు. ఆ విక్రయాలు చెల్లవని దేవస్థానం అధికారులు కోర్టుని ఆశ్రయించగా 2006లో జిల్లా కోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీనిపై కొనుగోలుదారులు హైకోర్టును ఆశ్రయించగా వాదోపవాదనల అనంతరం హైకోర్టు గత మార్చి నెలలో సదరు భూమి దేవస్థానానికి చెందుతుందని తీర్పు ఇచ్చింది. దీనిపై కోర్టు ఆదేశాల ప్రకారం శుక్రవారం గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది చెరువుల వద్దకు వచ్చి నాలుగు ఎకరాల ఆరు సెంట్లు భూమిని దేవస్థానం అధికారులకు అప్పగించారు.



దేవస్థానం భూమిని అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగబత్తుల షడ్రక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు సుంకరపాలెం పంచాయతీ బాబానగర్ గ్రామానికి చెందిన షడ్రక్ ద్విచక్రవాహనంపై కాకినాడ వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో షడ్రక్ తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు హుటాహుటిన 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



సుంకటరేవు వద్ద ఘటనా స్థలంలో అపస్మారకంగా పడి ఉన్న షడ్రక్

వైద్య విద్యపై ప్రైవేటు పంజా

- విద్యా రంగాన్ని ప్రభుత్వం వదులుకోవడం రాజ్యాంగ ద్రోహం
- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: వైద్య విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి ప్రజలపై ప్రైవేటీకరణ పంజా విసిరేలా చేస్తున్న కూటమి ప్రభుత్వం తీరు దారుణమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. విద్యా రంగం నుంచి ప్రభుత్వం చేతులెత్తేసినట్లుగా తప్పుకోవడం రాజ్యాంగ ద్రోహమేనని ఆయన ఆరోపించారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటుపరంపై ఆయన ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలాపురంలో రూ.కోట్లు వెచ్చించి వైద్య విద్యకు ప్రభుత్వ పరంగా ఊతమిస్తే దానిని పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేయడానికి కూటమి ప్రభుత్వానికి మనసెలా వచ్చిందని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. ఇలా రాష్ట్రంలోని పలు ప్రభుత్వ మెడికల్ కాలేజీల వ్యవస్థను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ స్వలాభం కోసం ప్రైవేటు పరం చేస్తోందన్నారు. ఇండియన్ మెడికల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ నుంచి అప్రూవల్ వచ్చిన ప్రభుత్వ వైద్య కళాశాలను కార్పొరేట్ సంస్థలకు అమ్మేసిందని ఆరోపించారు. ఇది నమ్మక ద్రోహం, ప్రభుత్వ తీరును, అడ్డగోలు నిర్ణయాలు, స్వలాభాల కోసం ప్రైవేటీకరణ చేయడం వంటి కుటిల ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. దేశాన్ని లేదా రాష్ట్రాన్ని సర్వ నాశనం చేయాలంటే అణుబాంబులు వేయనక్కర్లేదని, విద్యకు ప్రభుత్వాలు పాతర వేస్తే చాలని ఆయన విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను దూరం చేస్తే చాలు. వాటికి అవే సర్వ నాశనం అవుతాయన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్ పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కావడంతో తన తల్లిదండ్రులకు భారం కావడం ఇష్టం లేక, మనస్తాపానికి గురై ఓ యువకుడు శుక్రవారం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడితోటకు చెందిన ఇంటి శ్రీనివాస్ 17వ వార్డు మున్సిపల్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నాడు. అతని కుమారుడు తరుణ్‌కుమార్ (29) బీటెక్ పూర్తిచేశాడు. గురువారం నుంచి అతను కనిపించడం లేదు.

శ్రీనివాస్ ఇంటి నుంచి తీసుకువెళ్లిన మోటారుసైకిల్ గోదావరి బ్రిడ్జిపై ఉండడంతో ఆయన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే మర్నాడు ఉదయం ధవళేశ్వరం గోదావరి నదిలో శ్రీనివాస్ మృతదేహం తేలుతూ కనిపించింది. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసారు. శ్రీనివాస్ కొద్దిరోజుల క్రితం వైద్య పరీక్షలు చేయించుకోగా, అందులో క్యాన్సర్ అని రావడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ వ్యాధి వల్ల తన తల్లిదండ్రులకు రూ.లక్షలు వ్యయం చేయించి ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడినట్టు వారు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.